క్లుప్తంగా

అందోలు ఎంపీఓ సస్పెన్షన్

జోగిపేట(అందోల్): అందోలు మండల పంచాయతీ అధికారిపై వచ్చిన ఆరోపణలపై ఇటీవల విచారణ జరిపిన అనంతరం ఎంపీఓ సౌజన్యను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఎంపీఓపై అందోలు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. దీంతో నారాయణఖేడ్ డీఎల్‌పీఓచే విచారణ జరిపించగా నిజమని తేలడంతో ఎంపీఓను సస్పెన్షన్ చేశారు. కొన్ని రోజులుగా కార్యదర్శులు, ఎంపీఓకు మధ్య ఉన్న విభేదాలకు తెరపడింది.

నీలం మధుకు ఆహ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో ఈ నెల 16న నిర్వహించనున్న గంగమ్మ జాతరకు హాజరుకావాలని కాంగ్రెస్ నేత నీలం మధును మత్స్య సహకార సంఘం నాయకులు బుధవారం ఆహ్వానించారు. ఇందుకు నీలం మధు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేశ్, రాజు, సత్యనారాయణ, సాయికుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు సన్మానం



తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను బుధవారం నారాయణఖేడ్‌కు చెందిన సీపీఐ నాయకులు చిరంజీవి, జ్ఞానేశ్వర్, పండరీ, దత్తులు హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులు, ప్రజల పక్షాన పోరాడిన గొంతుక శాసన మండలిలో ఉండాలని ఎన్నుకున్నారన్నారని తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో బుధవారం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వర్షం నీరు వెళ్లే నాలాలో చెత్త పేరుకు పోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె తన సొంత ఖర్చుతో హిటాచీని తెప్పించి నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

నారాయణఖేడ్: ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో బస్సుల సంఖ్యను పెంచుతూ డ్రైవర్లు, కండక్టర్లు, నిర్వహణ సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆర్టీసీ ఖేడ్ డీఎం మల్లేశయ్య కోరారు. నారాయణఖేడ్ డిపో మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆయా గ్రామాలకు బస్సుల సౌకర్యం కల్పించేందుకు 10 పల్లె వెలుగు బస్సులు, 5 ఎక్స్‌ప్రెస్ బస్సులు, రెండు సూపర్ లగ్జరీ బస్సులు, నాలుగు డీలక్స్ బస్సులతో పాటు 50 మంది కండక్టర్లను, 70 మంది డ్రైవర్లను ఇప్పించాలని డీఎం మల్లేశయ్య వివరించగా స్పందించిన ఎమ్మెల్యే వివరాలతో కూడిన లేఖను మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ద్వారా నారాయణఖేడ్‌కు బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు.

అనుమానాస్పదంగా మృతి చెందిన బాలుడి గుర్తింపు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి ఓఆర్ఆర్ సర్వీసు రహదారి నుంచి కర్దనూర్ వైపు వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన బాలుడు పాత రామచంద్రాపురానికి చెందిన విష్ణుగా పోలీసులు గుర్తించారు. అయితే ఇతనికి తండ్రి లేడని, తల్లి మాత్రమే ఉందని పోలీసులు విచారణలో తెలుసుకున్నారు. బాలుడిని ఎవరు హత్య చేసి ఉంటారనే విషయమై దర్యాప్తును ముమ్మరం చేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.



కాలుష్య కాసారం!

గడ్డపోతారం-ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో ప్రవహిస్తున్న కాలుష్య జలాలు

మండల పరిధిలోని ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లో ఎక్కడ చూసినా కాలుష్య జలాలు ప్రవహిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రసాయన పరిశ్రమలతో పాటు పక్కనే ట్రీట్‌మెంట్ ప్లాంటు నుంచి భారీగా కాలుష్య జలాలు ప్రవహిస్తూ సమీపంలోని ఖాజీచెరువులోకి చేరుకుంటున్నాయి. దీంతో సమీపంలోని చెరువులు, కుంటలు కాలుష్యకారకంగా మారుతున్నాయి. వర్షాకాలంలో వర్షం నీటితో కలిపి కాలుష్య జలాలను బయటకు వదిలేయటం యాజమాన్యాలకు అలవాటుగా మారింది. కాలుష్య జలాల ప్రవాహాన్ని అరికట్టడంలో పీసీబీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని పారిశ్రామికవాడల ప్రజలు వాపోతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసినా హత్నూర మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వేసిన ముసుగును అధికారులు నేటికీ తొలగించలేదు. ఎలక్షన్ కమిషన్ కోడ్‌ను తొలగించినప్పటికీ క్షేత్ర స్థాయిలో విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించాలన్న ధ్యాస లేకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– హత్నూర(సంగారెడ్డి)



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వేసిన ముసుగు



మొలకెత్తిన పత్తి విత్తనాలు

చిగురించిన ఆశలు

ఈ ఏడాది ముందస్తు వర్షాలు రైతులను మురిపించడంతో పాటు తొలకరి సాగుకు సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో రైతులు ముందస్తుగానే పత్తి పంటను సాగుచేశారు. కానీ.. వర్షాలు ముఖం చాటేయడంతో పత్తి పంట సాగుచేసిన రైతుల్లో కొంత ఆందోళన నెలకొన్న పరిస్థితుల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. పత్తిచేలల్లో మొలకలు రావడాన్ని చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వట్‌పల్లి(అందోల్)

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మండల విద్యాధికారి శంకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈఓ శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గంగన్న, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అమృతమ్మ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలజీ, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

మునిపల్లి మండలంలో...

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఖమ్రోద్దీన్ ఉపాధ్యాయులతో కలిసి ఆయా తరగతుల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, గోపాల్, ప్రీతి, (పీటీఎస్) పార్ట్ టైం స్వీపర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో...

పటాన్‌చెరు: ప్రభుత్వ ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు కృష్ణ, మంజుల, ప్రమోద్‌రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, మహదేవ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీవో శంకర్ పుస్తకాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వెంకటేశం ,బారాస పట్టణశాఖ అధ్యక్షుడు అర్జున్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నర్సింహులు పాల్గొన్నారు.

జిన్నారం మండల పరిధిలో...

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు యూనిఫాం, బ్యాగులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. గుమ్మడిదలలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమర్‌గౌడ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు, యూనిఫాంను పంపిణీ చేశారు. అదేవిధంగా మాదారంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

శ్రద్ధగా చదువుకోవాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వెంకట నర్సింహులు అన్నారు. పాఠశాలలు పునప్రారంభం కావడంతో పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వట్‌పల్లిలో...

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మర్వెల్లి, కేరూర్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగిరెడ్డి, అనంతరాం, ఉపాధ్యాయులు లవకుశం, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట రూరల్: విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంఈఓ శంకర్



రామచంద్రాపురంలో..



జిన్నారం: గుమ్మడిదలలో..



వట్‌పల్లి: కేరూర్‌లో..



సంగారెడ్డి టౌన్‌లో..



పటాన్‌చెరు: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ వినీల

ఝరాసంగం(జహీరాబాద్): సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ వినీల అన్నారు. ఝరాసంగం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ దేవదాసు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో వివిధ గ్రామాలకు సంబంధించిన సభ్యులు వివిధ సమస్యలపై సభలో ప్రస్తావించారు. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి, విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పాడైన గుడ్లు వస్తున్నాయని ఎంపీటీసీ రాజు ఆందోళన వ్యక్తం చేశారు. బిడేకన్న గ్రామంలో విద్యుత్ స్తంభాలు దగ్గరకు చేయాలని కోరినా నేటికీ పనులు చేపట్టలేదని ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు ఎప్పటి నుంచి వస్తాయని ఎంపీటీసీ శంకర్ పటేల్, రాజు సమావేశంలో ప్రస్తావించారు. ఉపాధిహామీ పథకంలో ఈదులపల్లి గ్రామంలో దాదాపు 20మందికి జాబ్ కార్డులు కల్పించకపోవడంతో ఉపాధి హామీ పనులకు దూరమయ్యారని, ఉపాధి హామీలో చేపట్టిన పనులకు సంబంధించి నేటికీ బిల్లులు రాలేదని ఎంపీటీసీ శంకర్‌పటేల్ అన్నారు. మండల పరిధిలోని పొట్టిపల్లి రోడ్డు అధ్వానంగా మారిందని, రోడ్డు నిర్మాణపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీటీసీ రాజు, సొసైటీ చైర్మన్ గౌసోద్దీన్ సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిధిలోని గ్రామాల్లో గుంతలు ఉన్న రోడ్లపై మొరం వేయించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఝరాసంగంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీటీసీ శంకర్ పాటిల్ అన్నారు. పొట్టిపల్లి, జీర్లపల్లి, మెదపల్లి శివారులోని చెరువు నుంచి వృథా అవుతున్న నీటిని అరికట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ పథకంలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని సభ్యులు సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు ఉమామతి మారుతిరావు పాటిల్, రజినిప్రియ సంతోష్‌కుమార్ పాటిల్, విజేందర్‌రెడ్డి, సంగీత, అధికారులు సంజీవరావు, రమ్య, సునీల్ దత్, లక్ష్మయ్య, రాజ్ కుమార్, బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాసు

విద్యార్థుల సంఖ్యను పెంచండి



మాట్లాడుతున్న ఎంఈఓ పీపీ రాథోడ్



ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ రాథోడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేవిధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ

కల్హేర్(నారాయణఖేడ్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎంలు శైలజకులకర్ణి, సుందరమ్మ, టీచర్లు మోహన్, సంజీవ్‌కుమార్, రాజయ్య, మురళిగౌడ్, మశ్చేందర్, బాచ శ్రీనివాస్, ప్రసన్నలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు

జహీరాబాద్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఏడీఏ భిక్షపతి ఏఓ ప్రవీణతో కలిసి బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో డీఏపీ ఎరువుల నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం 1300 డీఏపీ ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

న్యాల్‌కల్ మండల పరిధిలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో ఎరువుల విక్రయ కేంద్రాన్ని బుధవారం ఏఓ లావణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు.

◆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పటాన్‌చెరు టౌన్: లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేష్ డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని హింజెల్ పరిశ్రమ కార్మికులతో బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం దృష్టి సారించాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ నాయకులు రోషన్, మల్లేష్, చారి, రెడ్డి పాల్గొన్నారు.

◆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం సరిగ్గా పని చేయకపోవడంతో అనేకమంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, యూనియన్ నాయకులు యాదగిరి, రాజు, శోభ పాల్గొన్నారు.

◆ మహిళల భద్రతకు కృషి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రజల సురక్షిత ప్రయాణం కోసం పోలీసుల బాధ్యతగా పనిచేస్తున్నారని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. బుధవారం కల్హేర్‌లో ఆటోలకు ప్రయాణికుల రక్షణకు సంబంధించిన స్టిక్కర్లు వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు.

◆ పైప్‌లైన్ పనులు నిలిపి వేయండి

జిన్నారం(పటాన్‌చెరు): ఎలాంటి అనుమతులు లేకుండా బొల్లారంలో గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. పైప్‌లైన్ నిర్మాణ పనులను జైపాల్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా కొంతమంది గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. రోడ్లు తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రోడ్లను తవ్వుతూ పైప్‌లైన్ పనులను చేపడుతుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌గోపాల్, బషీర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మేదరి వృత్తిదారులకు ఆదరణ కల్పించాలి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వమే బొంగులు ఉచితంగా సరఫరా చేసి మేదరి వృత్తిదారులకు ఆదరణ కల్పించాలని వెదురు పారిశ్రామిక సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల శ్రీనివాస్, సర్వ్ కట్టెల దుకాణదారుల సంఘం పటాన్‌చెరు అధ్యక్షుడు లోకదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరం బండ శివారులోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం పటాన్‌చెరు ప్రాంత మేదరి మహేంద్ర సంఘం వెదురు బొంగు, సర్వ్ కట్టెల దుకాణదారుల సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకదాస్ మాట్లాడుతూ.. మేదరబొంగు వ్యాపారులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా బొంగులు సరఫరా చేసి వృత్తిదారులకు ఆదరణ కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర కోశాధికారి పాతకోటి ఉమా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు అంబాదాస్, గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ కాలేజీలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించేందుకు అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉన్నవారు అర్హులన్నారు.

వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

జహీరాబాద్: వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్‌లోని ఏరియా ప్రభుత్వాస్పత్రిని బుధవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రికార్డులు, వైద్యుల హాజరు పట్టికను పరిశీలించారు. దీంతో పలువురు వైద్యులు గైర్హాజరు కావడం, మరికొందరు సెలవులో ఉన్నట్లు గుర్తించి వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతికి ఫోన్ ద్వారా కోరారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. 24 గంటల పాటు డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను, డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించారు.



వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



బ్లాక్ బెల్ట్ అందుకుంటున్న ప్రణతి

కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ

సంగారెడ్డి టౌన్: కుంగ్ ఫూ కరాటే పోటీల్లో ప్రణతి బ్లాక్ బెల్ట్ సాధించింది. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ఫూ ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ బ్లాక్ బెల్ట్ అవార్డు కోసం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రణతి బ్లాక్ బెల్ట్ సాధించింది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో ఉన్న 181 సర్వే నంబర్‌లోని ప్రభుత్వం భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహశీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ కూల్చి వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు